నాలా ప్రవాహానికి అడ్డంకి..

సెల్లార్‌లోనే వరద నీరు



సెల్లార్‌లో నిలిచిన వరద

- దుర్వాసన, దోమల విజృంభణ
- సందర్శించి వదిలేసిన హైడ్రా అధికారులు

బంజారాహిల్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నుంచి పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లే నాలా ఓ ప్రైవేట్ ప్లాటు వద్ద మలుపు తిరుగుతోంది. ఏడు సంవత్సరాల క్రితం ఆ ప్లాటు యజమాని నిర్మాణ పనులు చేసుకునేందుకు ప్రవాహానికి అడ్డంకి సృష్టించాడు. దీంతో మురుగు నీటి ప్రవాహం ఆగింది. అయితే, పెద్ద సెల్లార్ గొయ్యి తీసి చిన్న పాటి నిర్మాణాలు చేశాక పనులు మధ్యలో ఆగిపోయాయి. యజమాని కూడా పట్టించుకోలేదు. తాజా భారీ వర్షాల నేపథ్యంలో నాలా ప్రవాహంలో వచ్చిన వరదనీరు మొత్తం సెల్లార్ గుంతలోకి చేరాయి. దీనికి మురుగు కూడా తోడవడంతో దోమలు, దుర్వాసన వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. గతంలో హైడ్రా కమిషనర్ సందర్శించి నాలా అడ్డంకిని తొలగిస్తామని ప్రకటించారు. ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు.



నాలాలోని మురుగు నీరు

అనుమతులు తీసుకోకుండానే సెల్లార్..

జూబ్లీహిల్స్ కాలనీలో నుంచి నాలా రోడ్డు నెంబర్.36 మీదుగా మలుపు తిరిగి పెద్దమ్మ ఆలయం వరకు వెళ్తుంది. రోడ్డు నెంబర్.36లోని ప్లాట్ నెంబర్.459లో 600 గజాల స్థలం ఉంది. అందులో నుంచి నాలా వెళ్తుంది. గతంలో యజమాని జీహెచ్ఎంసీ అనుమతులకు వెళ్తే నాలా విషయం బయట పడుతుందని భావించాడు. ఈ మేరకు నాలా ప్రవాహానికి అడ్డంకులు సృష్టించాడు. ఆ విషయం బయటి వారికి తెలియకూడదని అనుమతులు తీసుకోకుండానే సెల్లార్ తీశాడు. మధ్యలోనే నిర్మాణం ఆపేసి సెల్లార్ మూయకుండా వదిలేశాడు. వర్షాలు పడిన సమయంలో ఇటు వర్షం నీరు అటు వరద నీరు నిలుస్తుండడంతో యజమాని కొద్ది రోజుల పాటు మోటార్లతో నీటిని బయటకు పంపించేవాడు. ఇటీవల వదిలేశాడు. ఫలితంగా వర్షాల కారణంగా భారీగా వరద నీరు సెల్లార్‌లోకి వచ్చి చేరింది. దీనికి తోడు నాలాలో వచ్చిన వరద నీరు ఇక్కడే నిలిచిపోయాయి. రెండు నెలల క్రితం హైడ్రా కమిషనర్ నాలాల పరిశీలన నిమిత్తం వచ్చినప్పుడు అడ్డంకి గురించి తెలుసుకున్నారు. త్వరలో చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కానీ, ఆచరణలోకి రాలేదు. ఫలితంగా దుర్వాసన వ్యాప్తి చెందడంతో దోమల వృద్ధి జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే డెంగీ, మలేరియా బారిన పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మారుతీనగర్ నాలా వద్ద పేరుకుపోయిన చెత్త

మూడు రోజులుగా పేరుకుపోయిన చెత్త

ఖైరతాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఫ్లైఓవర్ కిందిభాగంలోని మారుతీనగర్, రాజ్‌నగర్‌లను కలిపే బ్రిడ్జి వద్ద మూడు రోజులుగా చెత్తను తొలగించడం లేదు. దీంతో భరించలేని తీవ్ర దుర్గంధం వస్తోంది. ఇక్కడ రెండు రోజుల క్రితం కూరగాయల మార్కెట్ జరిగింది. వాటి వ్యర్థాలు సైతం పేరుకుపోగా, చెత్త పోగవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. వర్షం నీటికి చెత్త రాజ్‌నగర్ వాసుల ఇళ్ల ముందుకు కొట్టుకుపోతోంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అమ్మవారిని దర్శించుకున్న పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు

ఎల్లమ్మను దర్శించుకున్న కౌశిక్‌రెడ్డి దంపతులు

అమీర్‌పేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి అమ్మవారి శేష వస్త్రాన్ని అందజేశారు. అనంతరం కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి తన ఇంటి ఇలవేల్పు అని తెలిపారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. వీరి వెంట మాజీ కార్పొరేటర్ శేషకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎం.హన్మంతరావు, కూతురు నర్సింహ, కట్ట బలరాం, సంతోష్ మణి కుమార్, వనం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నెల రోజుల నుంచి

రాజ్‌నగర్‌లో వెలగని వీధిదీపాలు

- పెట్రేగిపోతున్న దొంగలు



రాజ్‌నగర్‌లోని ఓ వీధిలో అంధకారం

ఖైరతాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ రాజ్‌నగర్‌లో నెల రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. ఇక్కడున్న ఆరు వీధుల్లో చాలా వరకు వీధిదీపాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రోడ్డుపై గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారు. ఇక్కడ దొంగతనాలు కూడ జరుగుతున్నాయి. ఇప్పటికే రెండు ఇళ్లలో బంగారు ఆభరణాలు చోరీ కాగా, మరో ఇంట్లో చోరీకి విఫలయత్నం చేసి ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు వేతనాలు అందేనా?

- నిమ్స్‌లో 80 మందికి రూ.40 లక్షలు బాకీ
- కాంట్రాక్టర్ పోయి మూడు నెలలు



నిమ్స్ ఆస్పత్రి

నిమ్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పగలు, రాత్రి అన్న తేడా లేకుండా సెక్యూరిటీ గార్డులతో పనులు చేయించుకుని, వారికి ఇవ్వాల్సిన జీతాలకు మాత్రం కొర్రీ పెట్టారు. కాంట్రాక్టర్‌ను అడగాలంటే వెళ్లిపోయాడు. కాపలా కాయించుకున్న నిమ్స్ యాజమాన్యం నోరు మెదపడం లేదు. ఒక్కో గార్డుకు రూ.50 వేల చొప్పున 80 మందికి సుమారు రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉంది.

జీతాలు ఇవ్వకుండా తొలగిన ఏజెన్సీ నిర్వాహకుడు

ఓం సాయి ప్రొఫెషనల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నిమ్స్‌లో సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహించేవారు. సదరు సెక్యూరిటీ ఏజెన్సీకి, నిమ్స్ యాజమాన్యానికి మధ్య ఏం జరిగిందో తెలియదుగాని, ఏజెన్సీ నిర్వాహకుడు నిమ్స్ కాంట్రాక్ట్ నుంచి తొలగిపోయాడు. అయితే, ఆయన బయటకు వెళ్లే సమయానికి నెల రోజుల ఓవర్ టైమ్ (ఓటీ) వేతనంతోపాటు రెండు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో గార్డుకు సుమారు రూ.50 వేలు రావాల్సి ఉంది.

పాత బకాయిలు ఇస్తాం

పాత సెక్యూరిటీ ఏజెన్సీ గార్డులకు ఇవ్వాల్సిన బకాయిలను దాని స్థానంలో వచ్చిన ఏజెన్సీ ద్వారా చెల్లిస్తామని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.బీరప్ప చెప్పారు. గార్డులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా త్వరలోనే చెల్లిస్తామన్నారు.

బీరప్ప, నిమ్స్ డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో ఎరువుల కొరత

పంజాగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఎరువుల కొరత అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ ఎ.రమణ కుమార్ అధ్యక్షతన 'రాష్ట్రంలో ఎరువుల కొరత- రైతుల సమస్యలు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. నిరంజన్‌రెడ్డితో పాటు టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, రైతుసంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, ఆర్థిక, సామాజిక విశ్లేషకులు డి.పాపారావు, రైతు ఉద్యమ నాయకుడు వేనేపల్లి పాండురంగారావు, తదితరులు మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాని ఎరువుల కొరత, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎందుకు వచ్చిందని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఎరువు బఫర్ నిల్వలు ఉంటే, ప్రస్తుతం తెలంగాణలో 65 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నాయని, ఇది ముందస్తు ప్రణాళిక లేమికి నిదర్శనమని పేర్కొన్నారు. సమావేశంలో బోర్ల రాంరెడ్డి, సేవాలాల్ నాయకుడు హుస్సేన్ నాయక్, సీనియర్ జర్నలిస్టులు గొర్ల బుచ్చన్న, నర్రా విజయ్ పాల్గొన్నారు.



జానకమ్మ తోటలో పర్యటిస్తున్న ఆర్‌వీ కర్ణన్

అపరిశుభ్రత వల్లే సీజనల్ వ్యాధులు

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

బంజారాహిల్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అపరిశుభ్ర వాతావరణం కారణంగానే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, సిబ్బంది, అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని బోరబండ కుంట, సున్నంచెరువు, ఎస్‌పీఆర్ హిల్స్, కార్మికనగర్ పీటీ పాయింట్, రహ్మత్ నగర్, జానకమ్మతోట, నవీన్ నగర్ ప్రాంతాల్లో ఆయన జోనల్ కమిషనర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, హెల్త్, శానిటేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, సర్కిల్ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. వ్యర్థాల తొలగింపు తీరు, ప్రజారోగ్యం దృష్టిలో పెట్టుకొని తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్యకరమైన నగర నిర్మాణమే లక్ష్యంగా మాన్‌సూన్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు.

5 నుంచి ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ ప్రదర్శనలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): హైటెక్స్‌లో వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని డిజైన్ డెమోక్రటీ సహ వ్యవస్థాపకురాలు శైలజ పట్వారి తెలిపారు. బంజారాహిల్స్‌లో బుధవారం ఓ హోటల్ సహవ్యవస్థాపకులు పల్లిక శ్రీవాస్తవ్, క్యూరేటర్ అర్జున్ రాఠీతో కలిసి ప్రదర్శన వివరాలు వెల్లడించారు. డిజైన్ డెమోక్రసీ ప్రదర్శనలో ఫర్నిచర్, లైటెనింగ్, ఫ్లోరింగ్, హోమ్ ఫర్నిషింగ్స్ కిచెన్, బాత్, డెకార్ యాక్ససరీలు, ఫైన్‌ఆర్ట్ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ జెండా మరోసారి ఎగురవేయాలి

- కేటీఆర్



కేటీఆర్‌ను కలిసిన మాగంటి సునీత, బీఆర్ఎస్ నాయకులు

బంజారాహిల్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ జెండా మరోసారి ఎగురవేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్‌ను కలిశారు. నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ దివంగత నేత మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచి తనకు ఎదురులేదని నిరూపించారన్నారు. ప్రజల్లో ఇప్పటికీ ఆయన అంటే ప్రేమ, ఆదరణ ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని నాయకులు, కార్యకర్తలు ఉప ఎన్నికల కోసం సమాయత్తమవ్వాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలతో ఓటర్లు విసిగిపోయారని ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీకి ఓటు వేయవద్దని నిర్ధారించుకున్నారని తెలిపారు. త్వరలో డివిజన్‌ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాగంటి సునీత మాట్లాడుతూ మాగంటి లేని లోటును ఎవరూ పూడ్చలేరని, కార్యకర్తలకు మాత్రం తాను భరోసా ఇచ్చేలా ప్రతీ నిత్యం అందుబాటులో ఉంటున్నానని చెప్పారు. ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

దోమల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలి

బేగంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఓయూ ఉపకులపతి, ఓఎస్‌డీ ప్రొ. ఎస్.జితేందర్‌కుమార్ నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నిర్మూలన దినం సందర్భంగా బేగంపేటలోని సర్ రోనాల్డ్ రోస్ భవనంలో 'ది మస్కీటో, మలేరియా అండ్ వన్ హెల్త్' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి జితేందర్‌కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల ఎన్నో వ్యాధులు వస్తున్నాయన్నారు. 126 సంవత్సరాల కిందట ప్రాణాంతకమైన మలేరియా నిర్మూలన దిశగా సర్ రోనాల్డ్ రోస్ చేసిన పరిశోధనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. దోమల నివారణపై విస్తృత ప్రచారం అవసరమని ఓయూ జంతుశాస్త్ర విభాగాధిపతి, సర్ రోనాల్ రోస్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొ. రెడ్యానాయక్ అన్నారు. సర్ రోనాల్డ్ రోస్ పరశోధనలు, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన అంశాలపై చండీగఢ్ యూనివర్సిటీ ప్రొ.బి.కె.త్యాగి ప్రసంగించారు. ఈ సదస్సులో గాంధీ మెడికల్ కళాశాల ప్రొ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సర్ రోనాల్డ్ రోస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రొ. జితేందర్‌కుమార్ నాయక్, ప్రొ. రెడ్యానాయక్ తదితరులు

శిశు విహార్ ఆయాలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శిశు విహార్‌లో పనిచేస్తున్న 130 మంది ఆయాలకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయాలు శిశు విహార్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయాలకు ప్రతీ నెల 7వ తేదీలోపు జీతం ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించని ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం శిశు విహార్ జాయింట్ డైరెక్టర్ మోతికి వినతిపత్రం అందజేశారు. పది రోజుల్లో ఆయాల సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాపర్తి అశోక్, శేషగిరిరావు, కె.యాదగిరి, ఎం.వెంకటేష్, బి.సుశీల, ఆదిలక్ష్మి, శ్యామల, పద్మ, కవిత, సునీత, మంగ, నర్సమ్మ పాల్గొన్నారు.

మట్టి గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హానికరం కాని మట్టి గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బి.రవీందర్ పిలుపునిచ్చారు. అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం(హెచ్‌సీఎఫ్) రూపొందించిన మట్టి గణపతి పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, కాలనీ, బస్తీలలో అందరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ మానవ మనుగడకే ముప్పుగా పరిణమిస్తున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాలను ప్రతిష్ఠించ వద్దన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ ప్రతినిధులు మోహన్ నాయుడు, సంజీవరావు, హస్మిత, శ్రీనివాస్‌రావు, భిక్షపతి, రమేష్, శంకరయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో గణపతి మండపానికి కర్ర పూజ



గణపతి మండపానికి కర్ర పూజ చేస్తున్న నిర్వాహకులు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి యూత్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠిస్తున్న గణపతి మండపానికి బుధవారం కర్ర పూజ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పులిరామ్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, రవికుమార్‌గౌడ్, సురభి నవీన్, క్యాత్రాజ్, నీలేశ్వర్, సర్వేశ్వర్, వెంకట్రావు, గోపాల్, శ్రీనివాసరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

లిడ్‌క్యాప్ భూములు లీజుకిచ్చే జీవో రద్దు చేయాలి

పంజాగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలో వందల కోట్ల రూపాయల విలువ చేసే లిడ్ క్యాప్ భూములను లీజుకు, యూనిటీ మాల్ నిర్మాణాలకు ఇచ్చిన జీవోను రద్దు చేయాలని, మాదిగ చర్మకారులు పరిశ్రమలు నెలకొల్పడానికే వాటిని ఇవ్వాలని మాదిగ మేధావుల ఫోరం, తెలంగాణ రాష్ట్ర చర్మకారుల సంఘాల జేఏసీ డిమాండ్ చేశాయి. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఆరేపల్లి రాజేందర్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, సలహాదారులు మాణిక్యరావు, జేఏసీ కన్వీనర్ మొలుగు రాజు తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు రాజ్ కుమార్, బి.నర్సింహ, సత్యానంద్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



ఏజీ కాలనీలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న కోట నీలిమ, ఖమర్ అమీద



ఏజీ కాలనీలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ మురళిగౌడ్ తదితరులు

బేగంపేట/బంజారాహిల్స్/ఎర్రగడ్డ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన సేవా కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. సనత్‌నగర్ బస్టాండ్ వద్ద మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఖమర్ అమీద ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. రసూల్‌పుర చౌరస్తాలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనిఫ్‌ఖాన్, బబ్లూ, మునీర్‌ఖాన్ పాల్గొన్నారు. ఏజీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర కృష్ణ కుమార్, సార్దర్, ఖాజా పాషా, శ్రీనివాస్, పి.ఆకాశ్, జావీద్, జహంగీర్, దీపక్, సుబ్రమణ్యం, శివ కుమార్ పాల్గొన్నారు.



వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీబీఐ మాజీ అధికారి బత్తిన మునిరాజులు, పీవీ రవిశేఖర్‌రెడ్డి తదితరులు



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్, కాంగ్రెస్ నాయకులు రాములు చౌహాన్, బాబానాయక్ తదితరులు

రాజీవ్ మార్గ్‌గా వెంగళరావునగర్ ప్రధాన రహదారి

వెంగళరావునగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ ప్రధాన రహదారిని రాజీవ్ మార్గ్‌గా దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ వద్ద చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన సీబీఐ రిటైర్డ్ అధికారి బత్తిని మునిరాజులు ప్రకటించారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని ఆయన విగ్రహానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో వెంగళరావునగర్ కాలనీలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జి.మురళిగౌడ్ ఏజీ కాలనీ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో రాజీవ్ గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, మహ్మద్ గౌస్, చంద్రమౌళి, అరుణ్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బాలంరాయిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన బోయినపల్లి మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు, మాజీ చైర్మన్ ముప్పిడి గోపాల్, డి.బి.దేవేందర్, రాజేష్‌యాదవ్, నరేష్ ముదిరాజ్ తదితరులు



బోయినపల్లి ప్లేగ్రౌండ్ వద్ద రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు



సీతాఫల్‌మండిలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు



బోయినపల్లిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మూపిడి మధుకర్, వార్డు ప్రెసిడెంట్ మారుతీ గౌడ్ తదితరులు - బోయినపల్లి, ఆంధ్రజ్యోతి

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

సికింద్రాబాద్, బౌద్ధనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దేశానికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ నేతలు కొనియాడారు. ఆయన ముందు చూపు కారణంగా దేశం నేడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో దూసుకుపోతోందన్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో బుధవారం రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను శ్లాఘించారు.

తిరుమలగిరిలో..

బొల్లారం సాధన మందిర్ వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. రాజీవ్‌గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ పేదవర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కంప్యూటర్ యుగం ప్రారంభం చేసిన నవభారత నిర్మాత అని వేణుగోపాల్ రెడ్డి రాజీవ్ గాంధీని కొనియాడారు. బొల్లారంకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ 81వ జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని రంగ్రేజ్ బజార్‌లో యువజన కాంగ్రెస్ నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్ కరారేతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు దండుగుల మల్లిఖార్జున్. కార్యక్రమంలో మోండా డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల జయంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. - రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జలంధర్‌రెడ్డి, అభిషేక్, రవి, పాపన్న, వహీద్దున్ తదితరులు



ఆలుగడ్డబావి వద్ద అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

వర్షం నీరు నిలువకుండా చర్యలు

చిలకలగూడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆలుగడ్డబావి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షం నీరు నిలువకుండా చర్యలు చేపడుతున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి ట్రాఫిక్ తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలు సంభవించాయి. ఎన్నిమార్లు ఫిర్యాదులు, ధర్నాలు చేసినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలసి పర్యటించి తాత్కాలికంగా మోటార్లతో నీటిని తొలగించాలని, కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి వర్షం నీరు నిలువకుండా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

తొలగించిన వైర్లు.. ఇంటర్నెట్ కట్

అడ్డగుట్ట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నెట్‌కు అంతరాయం ఏర్పడడంతో అడ్డగుట్ట, తుకారాం గేట్ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అడ్డగుట్ట తుకారాంగేట్ పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు కుప్పలుగా వేలాడుతున్న ఇంటర్నెట్ వైర్లను విద్యుత్ అధికారులు, సిబ్బంది తొలగించారు. మంగళవారం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు కూడా ఇంటర్నెట్ సరఫరా లేకపోవడంతో వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.



అడ్డగుట్టలో ఇంటర్నెట్ వైర్లను కట్ చేసిన టెక్నీషియన్లు

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

తిరుమలగిరి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరుసగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలతో విద్యుదాఘాతం వల్ల పలువురు యువకులు మృతి చెందుతున్నారని, అలాగే బొల్లారం లకడావాల నుంచి రిసాల బజార్ వరకు ఉన్న కొన్ని విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి వంగిపోయాయని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ బొల్లారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. డౌటన్‌బజార్‌లోని సరస్వతి దేవాలయం ప్రాంతంలో కిందకి వేలాడుతున్న విద్యుత్ తీగలను పైకి ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా సదర్‌బజార్‌లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి ఉన్నాయని వాటిని తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఏఈని కలిసిన వారిలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రషీద్, సతీష్, జీవి బాల్‌రాజ్‌లు ఉన్నారు.

'ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు'

తార్నాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గాలి వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది జేఏసీ పోరాట ఫలితంగానే ఎన్‌డీఏ కూటమి అనివార్యంగా దక్షిణాదికి చెందిన వ్యక్తిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించిందన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీని ఎదుర్కొనే సత్తా కేవలం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాకు మాత్రమే ఉందని అన్నారు. డీజేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు అసిస్టెంట్ ప్రొఫెసర్ సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



శివరాజ్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాన్వేషణకై నగరానికి వచ్చిన యువకుడు కనిపించకుండా పోయిన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం నారాయణ్‌పేట్ జిల్లా భూత్‌పూర్ గ్రామానికి చెందిన కుర్వ శివరాజ్(23) 5వ తేదీన ఉద్యోగాన్వేషణకై నగరానికి వచ్చి రాణీగంజ్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోయేసరికి బాచుపల్లిలోని తన అత్తవాళ్ల ఇంటికి వెళుతున్నానని హాస్టల్‌లో తన స్నేహితుడైన అనిల్‌కు చెప్పి 9వ తేదీన వెళ్లాడు. విషయం తెలుసుకున్న శివరాజ్ అన్న నర్సింహులు శివరాజ్ కోసం ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో తమ బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలవకపోవడంతో బుధవారం మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శివరాజ్‌ను ఎక్కడైనా చూస్తే మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో కాని 8712661253, 8712660233, 8712660240 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

కళాసీగూడలో వృద్ధురాలు..



మల్లమ్మ (ఫైల్)

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం కళాసిగూడలో నివసించే మల్లమ్మ(70)కు మతి స్థిమితం లేదు. 15వ తేదీన ఉదయం 9 గంటలకు ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కోసం బంధువులు, తెలిసినవారి ఇళ్లలో వెతికినా కనిపించకపోయేసరికి మల్లమ్మ కూతురు దోమ తారా మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మల్లమ్మను ఎవరైనా ఎక్కడైనా చూస్తే మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో కాని 8712661253, 8712660233, 8712660240 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించి పరిష్కరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని విక్టోరియాగంజ్‌లో పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన ఆయన బుధవారం వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తమ బస్తీలో తరచుగా డ్రైనేజీ పొంగుతుందని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవడం లేదని వివరించారు. వెంటనే విక్టోరియా గంజ్‌లో డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రైనేజీ శుభ్రం చేసే క్రమంలో వస్త్రాలు, ప్లాస్టిక్ కవర్లు వంటివి వేస్తున్న కారణంగా డ్రైనేజీ లైన్లు బ్లాక్ అవుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ లైన్‌లో ఎలాంటి వస్తువులు వేయవద్దని, వేస్తే మీరే ఇబ్బందులకు గురవుతారని స్థానికులకు ఎమ్మెల్యే వివరించారు. అదే విధంగా నూతన రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉన్నందున వాటిని తొలగించి నూతన సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు జరగకముందే విద్యుత్ తీగలను తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్, వాటర్ వర్క్స్ డీజీఎం ఆశిష్, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, స్ట్రీట్ లైట్ అధికారి సాగర్, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వంజరపు ఆంజనేయులు, నాయకులు కొశికె కిషోర్, కోటిశ్వర్ గౌడ్, బస్తీ అధ్యక్షులు ఎస్సార్ మల్లేష్, బస్తీ వాసులు అర్జున్, కన్నం లావణ్య, దర్శనం శివకుమార్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవం

మారేడుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దోమ దినోత్సవం సందర్భంగా దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై బుధవారం మారేడుపల్లి కస్తూర్బా గాంధీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, అసిస్టెంట్ ఎంటమాలజీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్ర శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్

తార్నాక, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సామాజిక కార్యకర్త రామచంద్ర శ్రీనివాస్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పట్టాను పొందారు. బుధవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన నేషనల్ కాన్వకేషన్ కార్యక్రమంలో బీఆర్ఎస్ శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.

దోమల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాలి

బేగంపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఓయూ ఉపకులపతి, ఓఎస్‌డీ ప్రొ. ఎస్.జితేందర్‌కుమార్ నాయక్ అన్నారు. బుధవారం ప్రపంచ దోమల నిర్మూలన దినం సందర్భంగా బేగంపేటలోని సర్ రోనాల్డ్ రోస్ భవనంలో 'ది మస్కిటో, మలేరియా అండ్ వన్ హెల్త్' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి జితేందర్‌కుమార్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దోమల నివారణపై విస్తృత ప్రచారం అవసరమని ఓయూ జంతుశాస్త్ర విభాగాధిపతి, సర్ రోనాల్ రోస్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ప్రొ. రెడ్యానాయక్ అన్నారు. సర్ రోనాల్డ్ రోస్ పరిశోధనలు, దోమల వల్ల వచ్చే వ్యాధులు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన అంశాలపై చండీగడ్ యూనివర్సిటీ ప్రొ.బి.కె.త్యాగి ప్రసంగించారు. ఈ సదస్సులో గాంధీ మెడికల్ కళాశాల ప్రొ.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమీక్షా సమావేశం



వార్డు కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నామాలగుండు జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో బుధవారం సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌శాఖ, జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. రానున్న వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని చెట్టుకొమ్మలు తొలగించేలా, విద్యుత్ తీగలు అడ్డు లేకుండా ముందస్తూ చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్, విద్యుత్‌శాఖకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించాలని కోరారు. అలాగే రోడ్లపై గుంతలు ఏర్పడటం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచి వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్లు కుషాల్, నవ్య, హార్టికల్చర్‌శాఖ మేనేజర్ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో ప్రమాణం చేయిస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

రైళ్లపై దాడులు చేస్తే కఠిన చర్యలు : సరస్వత్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైళ్లపై రాళ్లతో దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్ హెచ్చరించారు. ఆపరేషన్ సంరక్షణ కింద సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు బుధవారం సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్ల సమీపంలో ఉన్న బస్తీలు, కాలనీల్లో పర్యటించి స్థానికులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇలాంటి దాడులకు పాల్పడుతున్న వారిపై నిఘా ఉంచామని తెలిపారు. అలాగే కొన్ని రైల్వేస్టేషన్ల సమీపంలో ఉన్న గ్రామ పంచాయితీల్లోబస్తీ పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ చేశామన్నారు. 2025లో ఇప్పటివరకు 6274సార్లు పోకిరీలు రైళ్లపై దాడులకు పాల్పడ్డారని, 8917 కేసులు నమోదు చేశామన్నారు. ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో ప్రయాణికులు 139 నంబరుకు సమాచారం ఇస్తే క్షణాల్లో ఆర్పీఎఫ్ పోలీసులు అక్కడికి వెళ్లి ఇలాంటి ఘటలను చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మేడ్చల్, సికింద్రాబాద్, బొల్లారం, అల్వాల్ ప్రాంతాల్లో కూడా కౌన్సిలింగ్ ఇచ్చామని ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా యువకులతో ఆర్పీఎఫ్ పోలీసులు ప్రమాణం చేయించారు.



రైల్వేస్టేషన్‌లో సమావేశంలో పాల్గొన్న రైల్వే పోర్టర్లు

రైల్వే పోర్టర్లకు న్యాయం చేయాలి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న రైల్వే పోర్టర్ల డిమాండ్లు, న్యాయం కోసం పోరాటం చేస్తానని దక్షిణ మధ్య రైల్వే లైసెన్స్‌డ్ పోర్టర్స్ సంఘం ముఖ్య సలహాదారుడు రాఘవయ్య అన్నారు. బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన రైల్వే పోర్టర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టర్లకు రైల్వే మంత్రిత్వశాఖ ఇచ్చిన సదుపాయాలపై అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. రైల్వే పోర్టర్లు పడుతున్న ఇబ్బందులపై రైల్వే వివిధ శాఖలకు చెందిన ముఖ్య అధికారులకు మెమోరాండలు అందజేశామన్నారు. మంత్రిత్వశాఖ మంజూరు చేసిన సదుపాయాల్లో ప్రతి ఏడాది యూనిఫారం, సత్వర బ్యాడ్జీలు, మెడికల్ కార్డులు, బ్యాటరీ కార్ల నిషేధించాలని, పార్శల్ కార్యాలయంలో పనుల్లో పునరుద్దరించడం, రైల్వే పాస్‌లు పంపిణీ చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ అధికారులను కోరారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలగింపు

బౌద్ధనగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ చౌరస్తాలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను అధికారులు తొలగించారు. ఇలా అక్రమంగా ఏర్పాటుచేసిన కేబుల్ వైర్ల వల్ల ఇటీవల నగరంలో ప్రమాదాలు జరిగి ఎనిమిది మృత్యువాత పడగా, మరికొందరు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి విధితమే. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్స్‌ను యుద్ధప్రాతిపదికపై తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో అధికారులు, సిబ్బంది కేబుల్స్ తొలగించే పనులను చేపట్టారు. అజామాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యానగర్‌శాఖ ఏఈ రోచిత ఆధ్వర్యంలో సిబ్బంది వారాసిగూడ ప్రధానరోడ్డుకు అనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలకు పేరుకుపోయిన కేబుల్స్‌ను తొలగిస్తున్నారు.



కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది



విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న కేబుల్ వైర్లు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఏసీపీ సైదయ్య

పోలీసులకు ఉచిత వైద్య శిబిరం

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహంకాళి పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు స్మార్ట్ విజన్ ఐ హస్పిటల్ మోహన్ డయాబెటిస్ స్పెషాలటీస్ సెంటర్ సౌజన్యంతో ఉచిత కంటి, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళి ఏసీపీ సైదయ్య కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఉండే పోలీసులు తమ ఆరోగ్యం శ్రద్ధ తీసుకునేందుకు సమయం చిక్కదన్నారు. ఇలాంటి మెడికల్ క్యాంపులు నిర్వహించడం వలన వారు ఆరోగ్య పరీక్షలు చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఇన్‌స్పెక్టర్ పరశురామ్‌ను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు. ఈ శిబిరంలో డీఐ రంగారెడ్డి, ఎస్సైలు సందీప్‌రెడ్డి, శ్రీధర్, ప్రసాద్ రెడ్డిలతో పాటు కానిస్టేబుళ్లు, హోమ్‌గార్డులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి, మెంబర్ సెక్రటరీ పంచాక్షరి

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం


రెజిమెంటల్‌బజార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారానికి ముందుకు రావడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని హైకోర్టు జడ్జి, మెంబర్ సెక్రటరీ పంచాక్షరి అన్నారు. సికింద్రాబాద్ అమృతవాణి భవనంలో క్రిస్టియన్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాలకు చెందిన లావాదేవి కేసులు, సివిల్, ఫ్యామిలీ, సంఘాల సంబంధించిన కేసుల పరిష్కారానికి క్రిస్టియన్ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ అండ్ మీడియేటర్ అరిఫ్, ఫాదర్ రాజు అలెక్స్, ఫాదర్ సుధాకర్, లీగల్ సర్వీస్ మెంబర్ సరోజ భాస్కర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎస్‌జె థామస్ తదితరులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ట్రస్టీలు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యను మధ్యలో ఆపివేయకుండా కొనసాగించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేస్తున్నామని బీఆర్‌జేసీ పార్శీ స్కూల్ ట్రస్టీ నాదిర్ చినోయ్ అన్నారు. సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని పార్శీ హైస్కూల్ ఆవరణలో 211 మంది విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధనాచారి మాట్లాడుతూ ప్రతిభావంతులైన పదిమందికి ట్యాబ్‌లను కూడా పంపిణీ చేశామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు సామ్ చినోయ్, మెహర్నోష్ చినోయ్, జాంగీర్ చినోయ్, సోమి పటేల్, సీనియర్ ఉపాధ్యాయులు ఎంవివి సత్యనారాయణ ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆత్మీయ వీడ్కోలు

దక్షిణమధ్య రైల్వే, సికింద్రాబాద్, రైల్‌నిలయం అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కస్తూరి మురళీకృష్ణ నెలాఖరుకి పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం సహోద్యోగులు ఆయనకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు పాత అనుభూతులు, అనుభవాలు గుర్తు చేసుకుంటు ఉత్సాహంగా గడిపారు. - చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

మర్యాదపూర్వక కలయిక



రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ కలిశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తున్న తీరు తెన్నులు వివరించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా చూడాలని మంత్రిని ఆయన కోరారు. - సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి